క్లుప్తంగా

పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ రమణయ్య

ముదిగొండ: మండలంలోని పమ్మి ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఆడిట్ సూపర్‌వైజర్ హేమంత్‌కుమార్, క్షేత్ర స్థాయి పరిశోధకుడు శ్రీనివాస్‌లు సోమవారం సామాజిక తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనం రికార్డు, రిజిస్టర్లు, విద్యార్థులకు రోజువారి మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం సరఫరా, పాఠశాల పరిశుభ్రత అంశాలపై వారు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణయ్య, చిరుమర్రి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, పాఠశాల హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

ముదిగొండ: ముదిగొండలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంఓ డాక్టర్ వెంకటరమణ సోమవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో టీకాల గది, ల్యాబ్, ఫార్మసీ, రికార్డులను ఆయన పరిశీలించారు. ఫైలేరియా కేసుల వివరాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్‌యాదవ్, వైద్యాధికారిణి అమూల్య, హెల్త్‌సూపర్‌వైజర్ లత, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలను సందర్శించిన ఏటీడబ్ల్యూఓ



మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూఓ జహీరుద్దీన్

ఏన్కూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్(వైరా) షేక్ జహీరుద్దీన్ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల సంఖ్య, హాస్టల్‌లోని సౌకర్యాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలు సేకరించారు. ఈఏడాది నుంచి కళాశాలలో హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సింహాచలం, అధ్యాపకులు కవిత, సుందర్, కృష్ణప్రసాద్, బాబూలాల్, రామారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వేంసూరు/కల్లూరు: పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరుతూ సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారయణ మాట్లాడారు. అదే విధంగా కల్లూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యలయం ఎదుట ఎండీఎం కార్మికులు ధర్నా నిర్వహించి ఎంఈఓ నివేదితకు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ నాయకుడు దయాకర్‌రావు, ఎండీఎం కార్మికులు రమదేవి, అప్పమ్మ, సుశీల, అలివేలు, మారెమ్మ, విజయలక్ష్మి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా అమ్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 మండలాల స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. కబడ్డీ మొదటి ప్రైజ్ ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు, రెండో బహుమతి కొణిజర్ల మండలం తనికెళ్ల, మూడో బహుమతి బోనకల్ మండలం నారాయనపురం టీమ్‌లు గెలుచుకోగా.. వాటిని కలకోట సొసైటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు అందించారు. నిర్వాహకులు పాపారావు, రాములు, వెంకటమోహన్, వెంకటేశ్వరరావు, రమేష్, లింగయ్య పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్: శ్రీసత్యసాయిసేవా సమితి ఆధ్వర్యాన జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సత్తుపల్లి శ్రీవాణి కళాశాల విద్యార్థిని రోహిణి విశాలాక్షి ఇంగ్లీష్ మీడియం విభాగంలో జిల్లాస్థాయి ప్రథమ బహుమతి సాధించింది. అదే విధంగా శ్రీనారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని మౌనిక తెలుగు మీడియం విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. హైస్కూల్ స్థాయిలో సదాశివునిపేటకు చెందిన జి.ఉషారాణి జిల్లా ప్రథమ బహుమతి సాధించారు. వీరికి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ సేవా కోఆర్డినేటర్ కోటేశ్వరి చేతుల మీదుగా మెమొంటో, సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థులను సత్యసాయి సేవా సంస్థల జిల్లా విద్యావిభాగ కోఆర్డినేటర్ తనూజ, కళాశాలల నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

పరామర్శ..

మధిర: అనారోగ్యంతో బాధపడుతున్న సిరిపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెలగపూడి శివరామ్ ప్రసాద్‌ను సోమవారం నందిగామ ఎమ్మెల్యే, ఏపీ ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు

- ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- ముగిసిన సర్వే.. సాగనున్న గ్రామసభలు
- మండలంలో 41 గ్రామ పంచాయతీలు
- గుడిసెల్లో బతుకుతున్న పేదింటి కుటుంబాలు



కారేపల్లి బొడ్రాయి బజారులో గుడిసెలో జీవిస్తున్న నిరుపేద కుటుంబం



తులిస్యాతండా గ్రామంలో..

ఈ సారైనా..

ఇందిరమ్మ ఇల్లు కల నెరవేరేనా..! అని ఏళ్లుగా కూలీనాలీ చేసుకొని గుడిసెల్లో మగ్గుతున్న పేదింటి కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. రెక్కాడితేగానీ డొక్కాడని బడుగుల జీవితాల్లో 'ఇందిరమ్మ ఇల్లు' వెలుగులు విరజిమ్మేనా..! అని కోటి ఆశలతో నిరుపేదకుటుంబాలు ఎదురు చూస్తున్నాయి.

కారేపల్లి: సింగరేణి మండలంలో 41 గ్రామ పంచాయతీలు ఉండగా.. 108 శివారు గ్రామాలు ఉన్నాయి. ఏజెన్సీ మండలం కావటంతో.. ఇంకా తండాలు, ఆదివాసీ గూడేల్లో సొంతిల్లు లేక.. చుట్టూ తడికలు, రేకులు కట్టుకొని, పైన గడ్డి గానీ, డేరాలు గానీ వేసుకొని పిల్లా జెల్లలతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ.. బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వాలు తమ దీనమైన బతుకులు చూసి ఏనాడైన మాకు సొంతిల్లు కట్టుకొనే అవకాశం ఇవ్వకపోదా అని ఎన్నో ఏళ్లుగా ఎదురు చేస్తున్నారు.

కారేపల్లిలోని బొడ్రాయి బజార్‌లో..

మండల కేంద్రం కారేపల్లి నడిబొడ్డులో బొడ్రాయి బజారులో జీవిస్తున్న నిరుపేద కుటుంబాలు ఉన్నాయి. తిరపమ్మ, కవిత, ఆదిలక్ష్మి తదితర కుటుంబాలు.. ఇప్పటికీ చుట్టూ తడికెలు కట్టుకొని.. గుడిసెల్లో జీవిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన, ఇంటింటి కులగణన సర్వేలో సైతం సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈసారైనా వారిని కనుకరిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేసేందుకు సంసిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు 21నుంచి మూడురోజులు ఆయా జీపీల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేపట్టనున్నారు. దీంతో.. ఇందిరమ్మ ఇల్లు కల నెరవేరబోతుందని లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఇదిలా ఉండగా.. మండల వ్యాప్తంగా సుమారు 8వేల కుటుంబాలు ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోగా.. సర్వేలో భాగంగా సెక్రటరీ ఫోన్ యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేశారు. పేర్లు రానివారు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవటంతో.. అధికారులు వివరాలను హౌసింగ్ బోర్డు అధికారులకు నివేదించగా, 59మంది లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలో ప్రదర్శించాలని రిపోర్టు సైతం మండల పరిషత్ కార్యాలయానికి నివేదించారు.



పూరిగుడిసె

రేకుల షెడ్డులో ఉంటున్నాం..



మట్టిగోడలతో ఉన్న పూరిగుడిసె గాలివానకు కూలిపోయింది. ఈ పక్కనే వేరేవాళ్ల స్థలంలో చుట్టూరేకుల, తడికెలు కట్టుకొని అద్దెకు ఉంటున్నాం. నాలుగేళ్లక్రితం జరిగిన ఓ ప్రమాదంలో నా కాళ్లు చచ్చుపడిపోయి మంచానికే పరిమితమైయ్యాను. 20ఏళ్ల క్రితం నా భర్త వదిలేసి ఎటో వెళ్లిపోవడంతో కూలీనాలీ చేసి నా కూతురు పెళ్లి చేశాను. ఇప్పుడు.. పెళ్లికాని మూగ చెల్లిని పట్టుకొని బతుకుతున్నా. నా చెల్లి కూలీ చేస్తూ సాదుతుంది. పెద్ద సార్లు మా దీనవస్తను చూసి, మాకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలి.

– గుగులోత్ బుజ్జి, తులిస్యాతండా

ఎన్నికలప్పుడే రాజకీయాలు..



మున్సిపల్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు ఉంటాయని ఎన్నికల అనంతరం అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం వైరాలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపాలిటీ చివరి కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తే తప్పక ప్రజలు గుర్తు పెట్టుకుంటారని, ప్రభుత్వాలు మారినప్పటికీ అభివృద్ధి ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. ఇప్పటికే వైరా మున్సిపాటిలీ అభివృద్ధికై సీఎంకు రూ.100కోట్లు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు ఇచ్చామని, రాగానే.. అభివృద్ధి పనులు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్‌తో పాటుగా 16మంది కౌన్సిల్ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించి మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమానికి నలుగురు కౌన్సిల్ సభ్యులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సీతారాములు, కమిషనర్ వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గా ప్రసాద్, రాజశేఖర్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ పొలంబాట కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ మైథిలి

మధిర: మధిర రూరల్ సెక్షన్ విద్యుత్ శాఖ వారి ఆధ్వర్యంలో సోమవారం చిలుకూరు, ఖమ్మంపాడు గ్రామాల్లో పొలం బాట కార్యక్రమం నిర్వహించి విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ సెక్షన్ ఏఈ ఎస్.మైథిలి మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగించే సమయంలో ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆదేవిధంగా విద్యుత్ మోటార్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కాల పరిమితి పెరిగేందుకు తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది కృష్ణ, వెంకటేశ్వరరావు, నాగరాజు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

మధిర నియోజకవర్గంలో..



చింతకాని: పాతర్లపాడు ఉన్నత పాఠశాలలో నిరసన తెలుపుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

మధిర/ఎర్రుపాలెం/బోనకల్/చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. తుక్కుగూడ ప్రధానోపాధ్యాయుడు రాములపై అరాచక శక్తుల దాడిని ఖండిస్తూ.. సోమవారం మధిరలోని మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఎర్రుపాలెం, బోనకల్, చింతకానిలోని పాతర్లపాడు పాఠశాలల్లో ఉపాధ్యాయులు మధ్యాహ్న విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు యరమల కోటారెడ్డి, వీరయ్య, బోనకల్, చింతకాని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు కోటేశ్వరరావు, రమణ, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ మాట్లాడుతూ.. అరాచక శక్తుల నుంచి ఉపాధ్యాయులను రక్షించేవిధంగా ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కోరారు. విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడటం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్తమ్మ, సైదారావు, వెంకటకృష్ణ, వెంకమ్మ, భరత్, రాజారావు, అనితారెడ్డి, నిరంజన్, శ్రీను, బాలకృష్ణ, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సద్దాబాబు, చిన్న రంగారావు, నరసింహారావు, నిర్మల, నారాయణ, సౌభాగ్యలక్ష్మి, కొమ్ము శ్రీను, రత్నాకర్ పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గంలో..



ఏన్కూరు: తిమ్మరావుపేటలో..

ఏన్కూరు/కొణిజర్ల: ఏన్కూరు మండలంలోని తిమ్మరావుపేట ఉన్నత పాఠశాలలో, కొణిజర్ల మండలంలోని పెద్ద గోపతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో.. ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాములుపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ రాంచంద్, మూడ్ పుల్లయ్య, శ్రీదేవి, పుల్లయ్య, నాగరాజు, శోభన్, శంకరరావు, రాఘవరావు, నరసింహారావు, హీరాలాల్, వసంత, సోనాబాయి, స్వర్ణకుమారి, సాజిదా బేగం, హెచ్ఎం మార్క్ పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో..

పెనుబల్లి/వేంసూరు: పెనుబల్లి మండలంలోని లింగగూడెం ఉన్నత పాఠశాలలో, వేంసూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సుబ్బయ్యకుంట చెరువు సర్వే..



కారేపల్లి: సర్వే నిర్వహిస్తున్న అధికారులు



తల్లాడ: కొలతలు వేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ధర్మారావు, తదితరులు

కారేపల్లి: కారేపల్లిలోని సుబ్బయ్యకుంట చెరువు ఆక్రమణకు గురవుతుందని.. స్థానిక మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడు తురక సాంబ, సంఘ సభ్యులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు.. సోమవారం జిల్లా సర్వే అధికారులు కారేపల్లిలోని సుబ్బయ్యకుంట చెరువుకు సంబంధించిన సర్వే నంబర్ 169, 171లో సర్వే చేపట్టి.. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ లను పరిశీలించి నివేధికలను తయారు చేసి మాట్లాడారు. జీపీఎస్ మ్యాప్ ఆధారంగా 10 రోజుల తర్వాత చెరువు సరిహద్దులు నిర్ణయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వే అధికారులు వెంకట్రావ్, కిరణ్‌కుమార్, ఆర్ఐ నరసింహారావు పాల్గొన్నారు.

తల్లాడ ఎదుళ్ల చెరువు సర్వేపూర్తి..

తల్లాడ: తల్లాడ పట్టణానికి ఆనుకొని ఉన్న ఎదుళ్ల చెరువు సర్వే సోమవారం ఎట్టకేలకు పూర్తైంది. ఇదివరకే చెరువు ఆక్రమణ విషయమై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. అప్పుడు చెరువు నిండా నీరు ఉండడంతో సర్వేను వాయిదా వేశారు. ఇప్పుడు నీరు తగ్గటంతో సర్వే చేశారు. తల్లాడ ఎదుళ్ల చెరువు 757 సర్వే నంబర్‌లో 113 ఎకరాల విస్తీర్ణం కల్గి ఉంది. ఈ చెరువు పరిధిలో 140 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ధర్మారావు ఆధ్వర్యంలో జల వనరుల శాఖ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చెరువు కొలతలు నిర్వహించారు. చెరవు శిఖం, పట్టా భూముల మధ్య మూడు పాయింట్లు పెట్టారు. ఈ సర్వేలో తల్లాడ జలవనరుల శాఖ ఏఈ శ్రీనివాసరెడ్డి, మండల సర్వేయర్ భరత్, ఆర్ఐ భాస్కర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్ఎలు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

వైరా: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం సీపీఎం నాయకులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం అందించగా.. స్పందించిన ఎమ్మెల్యే ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సీపీఎం నాయకులు చలపతిరావు, సుధాకర్, నాగేశ్వరరావు, మణి పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ఆందోళన

మధిర: రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో మధిర తహసీల్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాళ్లబండి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మందా సైదులు, నరసింహారావు, మురళి, మధు, రాధాకృష్ణ, శంకర్ రావు, ధనలక్ష్మి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా

ఎర్రుపాలెం: మండలకేంద్రానికి చెందిన వృద్ధురాలు మగినం వీరమ్మ ఇంటి వివాద సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కమిటీ అధ్యక్షుడు మందడపు ప్రభాకర్ మాట్లాడుతూ.. అధికారులు ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

వైరారూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రియింబర్స్, టీఎస్, జీఎల్ఐ రిటైర్‌మెంట్, జీపీఎఫ్ వంటి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘం ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రెబ్బవరం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వరప్రసాదరావు, బోస్‌బాబు, కరుణాకర్, రాము, అశోక్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

సత్తుపల్లిరూరల్: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అందరు కృషి చేయాలని సత్తుపల్లి ఐసీటీసీ కౌన్సిలర్ జి.కుబేరుడు అన్నారు. సత్తుపల్లిలోని సింగరేణి ఏరియా, బస్టాండ్ ప్రాంతాల్లోని కార్మికులు, లారీ డ్రైవర్లు, యువతకు మొబైల్ ఎల్‌సీడీ వాహనం ద్వారా హెచ్ఐవీ ఎయిడ్స్ సుఖవ్యాధులపై సోమవారం అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీయన్ డి.సురేష్, జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు వీణ పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

సత్తుపల్లిరూరల్: యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ఆ సంఘం జిల్లా నాయకులు, సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిల్ దూదిపాల రాంబాబు పిలుపునిచ్చారు. సత్తుపల్లిలో సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25 ఖమ్మంలో జరగనున్న జిల్లా యాదవ సంఘం విస్తృత స్థాయి సమావేశానికి యాదవలందరు రావాలన్నారు. నాయకులు గంగరాజు, మల్సూర్, నర్సిహరావు, సత్యనారాయణ, పెద్దిరాజు పాల్గొన్నారు.

ఎఫ్‌పీసీ సీఈఓ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కొణిజర్ల: కొణిజర్ల ఆదర్శ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పీసీ)కు కార్య నిర్వహణాధికారి(సీఈఓ) పోస్టుకు తాత్కాలిక పద్ధతిన పని చేయడానికి అర్హులైన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కంపెనీ చైర్మన్ ఓ.ఫణికుమారి, ఏపీఎం బి.నాగ పుల్లారావు తెలిపారు. 35 ఏండ్లలోపు వయసు కలిగి బీఎస్సీ అగ్రికల్చర్ లేదా అగ్రికల్చర్ ఎంబీఏ, అగ్రికల్చర్ డిప్లొమా చేసిన అభ్యర్థులు ఈ నెల 28లోగా కొణిజర్ల ఆదర్శ మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎఫ్‌పీసీలో వాటా ధనం కలిగి ఉన్న కుటుంబ సభ్యులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.

గుండెపోటుతో రిటైర్డ్ ఉద్యోగి మృతి

కల్లూరు: కల్లూరుకు చెందిన అటవీ శాఖ రిటైర్డ్ ఉద్యోగి ఉప్పు నర్సింహారావు(80) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య లీలావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వివిధ పార్టీల నాయకులు పెద్దబోయిన దుర్గాప్రసాద్, డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, లక్కినేని ప్రసాద్, లక్కినేని రమేష్, గునుకుల ఈశ్వరరావు, లక్కినేని కృష్ణ, అత్తునూరి రంగారెడ్డి, కొమ్మూరి దర్గయ్య, బైరెడ్డి మనోహర్‌రెడ్డి, యాసా వెంకటేశ్వరరావు, జిల్లేల్ల కృష్ణారెడ్డి, మాదిరాజు లక్ష్మణరావు, కొండూరు కిరణ్‌కుమార్, ఆకుల గాంధీ, శెట్టి రంగారావు, తోట జనార్దన్ తదితరులు నర్సింహారావు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వితరణల వెల్లువ..

విద్యార్థులకు నోట్ పుస్తకాలు..

తల్లాడ: మండలంలోని కొడవటిమెట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. బహుజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మోదుగు బాలకృష్ణ పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సాయం చేయటమే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిగూడెం గ్రామాభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బద్దం కోటిరెడ్డి, పాఠశాల హెచ్ఎం సునీత, మాజీ ఉప సర్పంచ్ కాంపల్లి వీరయ్య, పొన్నం కృష్ణయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ కోసం..

బోనకల్: మండల పరిషత్ కార్యాలయానికి ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు భాగం ఫౌండేషన్ అధ్యక్షుడు భాగం రాకేష్ రూ.11 వేలను వితరణగా.. ఎంపీడీఓ రమాదేవికి అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఒక సంవత్సరం పాటు ఇంటర్నెట్ సౌకర్యానికి అయ్యే ఖర్చును భాగం ఫౌండేషన్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శాస్త్రీ, మండల ప్రత్యేక అధికారి విజయ బాస్కర్‌రెడ్డి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీవేంకటేశ్వరస్వామికి పంచలోహ వక్షస్థల ఆభరణం..




ఆభరణాన్ని అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రూ.32,116 విలువలైన పంచలోహ వక్షస్థల ఆభరణాన్ని కొత్తగూడెంకు చెందిన జేవీఆర్ ఓసీ సర్వేయర్ జి.బాలకృష్ణ, రాధిక దంపతులు సోమవారం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, ఉబ్బల వెంకటేశ్వరరావు, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

పథకాలు అర్హులకు చేరాలి



వైరా: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సత్యనారాయణ



పెనుబల్లి: మాట్లాడుతున్న ఆర్డీఓ రాజేందర్ గౌడ్



బోనకల్: ముష్టికుంట్లలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత

వైరా: ఈ నెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల కోసం నిర్వహించే గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని మండల ప్రత్యేకాధికారి కస్తాల సత్యనారాయణ సూచించారు. సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన మండలస్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల నుంచి గ్రామసభల్లో కూడా దరఖాస్తులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, ఏడీఏ కరుణశ్రీ, ఏఓ మంజుఖాన్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ జ్యోత్స్న, జీపీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

- పెనుబల్లి/తల్లాడ/కల్లూరురూరల్: ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని కల్లూరు ఆర్డీఓ రాజేంద్ర గౌడ్, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు తెలిపారు. పెనుబల్లి, కల్లూరు మండల పరిషత్ కార్యాలయాల్లో, తల్లాడ తహసీల్‌లో అధికారులతో నిర్వహించి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు వనజ, ప్రతాప్, పులి సాంబశివుడు, ఎంపీడీఓలు అన్నపూర్ణ, చంద్రశేఖర్, డీటీ బాబ్జిప్రసాద్, ఏఓలు తాజుద్దీన్, ఏవీఎస్ ప్రసాద్‌రాజు, రూప, ఎంపీఓలు సురేష్‌బాబు, కె.శ్రీదేవి, ఉపేంద్రయ్య, ఈజీఎస్ ఏపీఎం హేమమాలిని ఆర్ఐలు భాస్కర్, ఖాజామొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.
- మధిర/ బోనకల్/ ముదిగొండ/ ఎర్రుపాలెం/ చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్న నాలుగు సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లో నిర్వహించే సభలకు ఆయా లబ్ధిదారులు హాజరుకావాలన్నారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో సభలు నిర్వహిస్తారని తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. అదే విధంగా బోనకల్‌లోని ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ముదిగొండలోని రైతువేదికలో గ్రామ సభల నిర్వహణపై సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ అధికారి సమయ పాలన పాటించి గ్రామసభకు హాజరుకావాలన్నారు. ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ సరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసభల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి చందన్‌కుమార్ అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశాల్లో తహసీల్దార్ అనంతరాజు, డీటీ వీరభద్ర నాయక్, మండల ప్రత్యేకాధికారులు విజయలక్ష్మి, విజయ్ బాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓలు శ్రీధర్‌స్వామి, రమాదేవి, రామయ్య, ఎంపీఓలు వాల్మికీ కిషోర్, శాస్త్రీ, ఏఓలు మానస, వేణు, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, ఏపీఓ రంగనాయకమ్మ, పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.